సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 26 । ఆగస్టు । 2024



అన్నపూర్ణ నిలయానికి వితరణ


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిర్మించనున్న అన్నపూర్ణ నిలయానికి గణపతినీడి జగదీష్, స్వప్న దంపతులు (రాజమహేంద్రవరం) రూ.1,11,116 విరాళం అందజేశారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి దసర పట్టాభిరామస్వామి దంపతులు (కాకినాడ), తిరుమంజం బాలాజీ (హైదరాబాద్) రూ. 1,00,116 చొప్పున విరాళాలుగా అందజేశారు.

2.02 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 2,02,066 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 12,100 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు రిఫరీగా శ్రీనివాస్



సాక్షి, అమలాపురం: షటిల్ బ్యాడ్మింటన్ అంతర్జాతీయ పోటీలకు రిఫరీగా పనిచేసే అవకాశం అమలాపురానికి చెందిన పాయసం శ్రీనివాస్‌కు దక్కింది. షటిల్ బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో మహారాష్ట్ర పూణేలో సాగుతున్న ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ మెగా టోర్నీకి రిఫరీగా ఆయన సేవలందించనున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్టు శ్రీనివాస్ ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబరు ఒకటో తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఇండియా, చైనా, ఇండోనేషియా, కొరియా, మలేషియా, డెన్మార్క్‌తోపాటు వివిధ దేశాల క్రీడాకారులు పాల్గొనే ఈ టోర్నీకి తనకు అవకాశం రావడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. అయినవిల్లి మండలం నల్లచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో థామస్ ఉబర్ కప్, ఇండియన్ ఓపెన్ టోర్నీ మూడుసార్లు, స్కూల్ గేమ్స్ వరల్డ్ చాంపియన్ షిప్, నేషనల్ గేమ్స్, ఖేలో ఇండియా గేమ్స్‌తో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ టోర్నీలకు ఆయన రిఫరీగా వ్యవహరించారు. ఆయనను ఏపీబీఏ కార్యదర్శి అంకమ్మ చౌదరి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ కొత్తపల్లి బాల సుబ్రహ్మణ్యం, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల వెంకట రమణబాబు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లాడ శరత్‌బాబు, బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్, హెచ్‌ఎం అక్కల వెంకట్రావులు అభినందించారు.

వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర ఆలయ అవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి అమరావతికి చెందిన పి.శ్రీరామమూర్తి, రేఖ సువర్చల దంపతులు రూ.లక్ష విరాళం అందించినట్టు ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. దాతకు ఆలయ ఈఓ చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

లోవకు భక్తుల తాకిడి

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానం కిటకిటలాడింది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన ఐదు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,17,960, పూజా టికెట్లకు రూ.88,090, కేశఖండన శాలకు రూ.9,160, వాహన పూజలకు రూ.5,100, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.78,216, విరాళాలు రూ.69,174 వెరసి మొత్తం రూ.3,67,700 ఆదాయం సమకూరినట్టు ఈఓ వివరించారు.

నేడు రత్నగిరిపై శ్రీకృష్ణాష్టమి వేడుకలు



రత్నగిరిపై శ్రీగోకులం

అన్నవరం: శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా సోమవారం రత్నగిరిపై కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం తొమ్మిది గంటలకు గోపూజ, సత్యదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రత్నగిరిపైగల శ్రీగోకులంలో కొలువైన శ్రీకృష్ణుడికి కూడా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గోకులంలోగల సప్త గోవులకు పూజలు చేస్తారు. అనంతరం రాత్రి ఎనిమిది గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని రామాలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి అక్కడ ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉట్టు కొట్టే కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం కొండ దిగువన తొలి పావంచా వద్ద, ఆంధ్రాబ్యాంక్ సెంటర్‌లో కూడా ఉట్టు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పల్లకీ మీద స్వామిఅమ్మవార్లను గ్రామంలో ఊరేగిస్తారని అధికారులు తెలిపారు.

భయాందోళనలు తొలగించాలి



ఇటీవల వైద్యులు, నర్సులపై జరుగుతున్న దాడులను చూస్తుంటే భయాందోళన కలుగుతోంది. మహిళా వైద్యులు పనిచేసేచోట కచ్చితంగా రక్షణ ఏర్పాట్లు చేయాలి. ఇటీవల కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన దేశవ్యాప్తంగా ఆలోచన రేకెత్తించింది. వైద్యుల రక్షణకు కమిటీని నియమించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో వైద్యులు, నర్సులకు ప్రత్యేక భరోసా ఏర్పడింది. ఆస్పత్రుల్లో జరుగుతున్న సంఘటనల వల్ల వైద్య సేవలు అందించడం డాక్టర్లకు సవాల్‌గా మారింది.

– డి.సువర్చలాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల్ల



సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టు అమలు చేయాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఉదంతం మమ్మల్ని తీవ్రంగా కలిచి వేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మన రాష్ట్రంలో మహిళా వైద్యుల కోసం ఆస్పత్రి వద్ద పోలీసుల రక్షణతో పాటు అన్ని రకాల వసతులు కల్పించాలి. డ్రెస్సింగ్ రూమ్, రెస్ట్ రూములను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టును వెంటనే అమలు చేయాలి. మహిళా వైద్య సిబ్బందికి ధైర్యాన్ని కల్పించాలి.

– వీరవల్లి వెంకట శైలజ, స్త్రీల వ్యాధుల వైద్యురాలు, అంబాజీపేట

సీమకు సుస్తీ

- జిల్లా వ్యాప్తంగా వైరల్ జ్వరాలు
- ప్రభుత్వ.. ప్రైవేట్ ఆస్పత్రులకు బారులు తీరుతున్న జ్వర పీడితులు
- క్రమేపీ పెరుగుతున్న డెంగీ కేసులు
- వాతావరణ మార్పులతో పాటు.. క్షీణించిన పారిశుధ్యమూ కారణం
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

సాక్షి, అమలాపురం: మారిన వాతావరణ పరిస్థితులు.. పారిశుధ్యం పట్టని అధికారులు.. ప్రభుత్వ నిర్లక్ష్యం తదితర కారణాలతో జిల్లా మూడంకె వేసి మూలుగుతోంది. ఏ ఇంట్లో చూసినా.. ఏ ఆస్పత్రిలో చూసినా జ్వర బాధితులే కనిపిస్తున్నారు. ప్రభుత్వ.. ప్రైవేట్ ఆస్పత్రులనే తేడా లేదు... పీహెచ్‌సీలు మొదలుకొని సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు.. ప్రైవేట్ ఆస్పత్రులలో నమోదవుతున్న కేసులలో మూడో వంతు వివిధ రకాల జ్వరాల బారిన పడుతున్నవారే కావడం గమనార్హం.

జిల్లాలో జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీలతో పాటు జిల్లాలోని 22 మండలాల పరిధిలో రెండు ఏరియా ఆస్పత్రులు, మూడు సీహెచ్‌సీలు, ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లు, 49 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఏరియా ఆస్పత్రులతో పాటు సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల రోజువారీ ఔట్ పేషెంట్లలో సాధారణ, వైరల్ జ్వరాల బారిన పడిన వారి సంఖ్య అధికంగా ఉంటోంది. ఏరియా ఆస్పత్రులకు రోజుకు 40 నుంచి 60 వరకు, ఆయా పీహెచ్‌సీలకు రోజుకు 10 నుంచి 15 మంది వరకు జ్వరపీడితులు వస్తున్నారు. వీరిలో పలువురికి మలేరియా సాధారణ జ్వరాలు నమోదవుతున్నాయి. డెంగీ కేసులు సైతం గణనీయంగానే బయటపడుతున్నాయి. ఆగస్టు మొదటి వారంతో పోల్చుకుంటే ఇప్పుడు జ్వర బాధితుల సంఖ్య గణనీయంగా తగ్గినట్టు వైద్యాధికారులు చెబుతున్నారు. కాని కేసులు వస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ

సాధారణ జ్వరంలో కూడా ప్లేట్‌లెట్లు తగ్గుతుంటాయి. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రులు దోపిడీకి దిగుతున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ నిఘా లేకపోవడం వీరికి కలిసివస్తోందని పలువురు రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రక్త పరీక్షలలో ప్లేట్‌లెట్లు తగ్గినట్టు కనిపిస్తే చాలు డెంగీ వైద్యాన్ని ప్రారంభించినట్టు చెప్పి సొమ్ములు గుంజేస్తున్నారు. ఎలీసా పరీక్షలు పాజిటివ్ వస్తేనే డెంగీగా నిర్ధారించాల్సి ఉంది. అదే విధంగా ప్రభుత్వ ఆస్పత్రులలో నిర్వహిస్తున్న పరీక్షలలో డెంగీ నిర్ధారణ కాగానే మెరుగైన వైద్యం కోసం రోగులు ప్రైవేట్ ఆస్పత్రులలో చేరుతున్నారు. వేలకు వేలు జేబులకు చెల్లు పెట్టుకుంటున్నారు.



మండపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

అమలాపురం ఏరియా ఆస్పత్రికి రోజుకు సగటున 12 వైరల్ జ్వరాల బాధితులు వస్తూ చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరు డెంగీ ఇన్‌ఫెషెంట్లు కూడా ఉన్నారు. అలాగే రోజుకు సుమారు 300 మంది వరకు జ్వర బాధితులవు ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. పట్టణ పరిధిలో కొంకాపల్లిలో ఇంచుమించు 60 మంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. డెంగీతో ఆరుగురి వరకు బాధపడుతున్నారని అంచనా. రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి రోజుకు 50 నుంచి 60 కేసుల వరకు వస్తున్నాయి. అధికారికంగా డెంగీ కేసులు నిర్ధారణ జరగలేదు. కాని కొంతమందికి డెంగీ లక్షణాలు కనిపిస్తున్నాయి. మండపేట సీహెచ్‌సీలలో రోజుకు 150 వరకు ఓపీ ఉండగా, 30 నుంచి 40 మంది వరకు జ్వరాల బాధితులున్నారు. వీరిలో చిన్నారుల సంఖ్య కూడా అధికంగానే ఉంది.

కొత్తపేట మండలం వానపల్లి, అవిడి పీహెచ్‌సీల పరిధిలో ఈ నెలలోనే సుమారు 800 వరకు జ్వరాలు కేసులు రాగా, వాటిలో 100 వరకు టైఫాయిడ్ జ్వరాలుగా నిర్ధారించారు. సుమారు 5 వరకు డెంగీ కేసులు నమోదయ్యాయి. ముమ్మిడివరం సీహెచ్‌సీ పరిధిలో శనివారం మూడు జ్వర బాధిత కేసులు ఓపీకి వచ్చారు. ఈ నెలలో ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలో సుమారు 32 డెంగీ కేసులు నమోదయ్యాయి. రాజోలు, మలికిపురం, తాటిపాక పీహెచ్‌సీలు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జ్వర పీడితులు అధికంగా ఉన్నారు. ఇక్కడకు వస్తున్నవారిలో ప్లేట్‌లెట్లు తక్కువగా ఉంటున్నాయి. కాని ఎలీసా పరీక్షలలో డెంగీ నిర్ధారణ కావడం లేదు. కాట్రేనికోన మండలం కాట్రేనికోన, పల్లంకుర్రు, ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం, సఖినేటిపల్లి మండలం రామేశ్వరం పీహెచ్‌సీలకు సమీపంలోని మత్స్యకార గ్రామాల నుంచి జ్వరపీడితులు ఎక్కువగా వస్తున్నారు.

వాతావరణ మార్పులతో అవస్థలు

వాతావరణ మార్పుల వల్ల జ్వరాల తీవ్రత పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. అప్పుడప్పుడూ వర్షాలు.. వేసవిని తలపించే ఎండలు, తేమతో కూడిన వాతావరణం సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ వాతావరణం వల్లే పలువురు జ్వరాలు, ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు బారిన పడుతున్నారు. 'జలుబు, దగ్గు వస్తుంటే వెంటనే తగ్గడం లేదు. ఎన్ని మందులు వాడినా తగ్గేందుకు 15 రోజుల పాటు ఇబ్బంది పడాల్సి వస్తోంది' అని రోగులు వాపోతున్నారు.

ప్రధాన మున్సిపాలిటీలకు డంపింగ్ యార్డుల సమస్యలు పెద్దగా లేవు. కాని పారిశుధ్య నిర్వహణ సిబ్బంది కొరత అధికంగా ఉంది. రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో వార్డుకు వచ్చి కనీసం నలుగురు పారిశుధ్య సిబ్బంది ఉండాల్సి ఉండగా, కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. మండపేటలో సైతం ఇదే పరిస్థితి నెలకొని ఉంది. మేజర్ పంచాయతీల్లో సైతం ఇదే పరిస్థితి. డ్రైనేజీల నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో దోమలు పెరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా తాగి పడేసిన కొబ్బరి బొండాలు, వర్షం వల్ల నిలిచిపోయిన చప్పనీటిలో పుడుతున్న ఎడిస్ దోమలు కుట్టడం వల్ల జనం డెంగీ బారిన పడుతున్నారు.



అమలాపురం మున్సిపాలిటీ పరిధి అశోక్ నగర్ గ్రంథాలయం సమీపంలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నిలిచిన వర్షపు నీరు, చెత్త



కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీలో రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

ప్రతి మహిళా లక్షాధికారి కావాలి

- జాయింట్ కలెక్టర్ నిశాంతి
- స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.50 కోట్లు అందజేత



స్వయం సహాయక సంఘాల్లోని లఖ్‌పతి దీదీలకు మెగా చెక్కు అందజేస్తున్న జేసీ నిశాంతి

అమలాపురం రూరల్: మహిళలలో ఆర్థిక స్వావలంబన పెంపొందించి ప్రతి మహిళను లక్షాధికారిగా చేయడమే లక్ష్యంగా లఖ్‌పతి దీదీ కార్యక్రమం అమలు చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి పేర్కొన్నారు. ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మహారాష్ట్రలోని జల్గావ్‌లో లఖ్‌పతి దీదీలను సన్మానించిన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టరేట్‌లో వీక్షించారు. జేసీ మాట్లాడుతూ ప్రతి మహిళను లక్షాధికారిగా చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు. వరసగా నాలుగు వ్యవసాయ సీజన్లలో బిజినెస్ సైకిల్‌లో వార్షిక ఆదాయం లక్ష కంటే ఎక్కువ కలిగి ఉన్న స్వయం సహాయక సంఘ మహిళలను లఖ్‌పతి దీదీలు గా పరిగణిస్తారన్నారు. జిల్లాలో 100 రోజుల్లో 4072 మంది, ఈ ఆర్థిక సంవత్సరంలో 67,867 మంది స్వయం సహాయక సంఘ మహిళలను లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ఇచ్చినట్టు తెలిపారు. ప్రతి మహిళకు తక్కువ వడ్డీతో రూ.ఐదు లక్షల వరకు రుణాలు అందించేందుకు ప్రత్యేకమైన పథకాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా సబ్సిడీ కింద రుణాలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 507 స్వయం సహాయక సంఘాల్లోని లఖ్‌పతి దీదీలకు రూ.50 కోట్ల బ్యాంకు రుణాల మెగా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ డాక్టర్ శివశంకర్ ప్రసాద్, స్టేట్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వంశీకృష్ణ, లీడ్ బ్యాంకు మేనేజర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు



లక్ష్మీగణపతి హోమానికి అగ్ని మథనం చేస్తున్న రుత్విక్కులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలు కొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస, రుద్రాభిషేకాలు, వివిధ ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని మహా నివేదన అనంతరం అర్చకస్వాములు సర్వాంగ సందరంగా అలంకరించారు. స్వామి వారి లఘున్యాస, ఏకదశ రుద్రాభిషేకాల్లో 34 మంది, లక్ష్మీగణపతి హోమంలో 12 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. 20 మంది తమ నూతన వాహనాలకు పూజలు నిర్వహించారు. 24 మంది చిన్నారులకు తులాబారం నిర్వహించారు. స్వామివారి అన్నదాన పథకంలో 1248 మంది అన్నప్రసాదం స్వీకరించారు. స్వామికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,85,483 ఆదాయం లభించిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

లక్ష్మీనృసింహుని దర్శించుకున్న ఎస్పీ కృష్ణారావు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పూర్ణకుంభంతో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకట శాస్త్రి, అర్చకుడు ఎస్‌బీఎం రామకృష్ణమాచార్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. ఆయనకు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు. ఆయన వెంట ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ కృష్ణారావుకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

అంబాజీపేట జెడ్పీహెచ్‌ఎస్‌కు సైట్

- రేపటి కోసం పూర్వ విద్యార్థుల కృషి
- పాఠశాల ప్రగతితో రూపకల్పన
- ఇదే బాటలో మరిన్ని పాఠశాలలు

సాక్షి అమలాపురం: వంద ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్ పేరున ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు 'డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జడ్పీహెచ్‌ఎస్ అంబాజీపేట' అనే వెబ్‌సైట్ రూపొందించారు. ఈ వెబ్‌సైట్‌లో పాఠశాల విశేషాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాల వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ పాఠశాల ఏర్పడి 104 ఏళ్లు అయ్యింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ఈ పాఠశాలకు అరుదైన గుర్తింపు ఉంది. అతిపెద్ద క్రీడా మైదానం ఉన్న పాఠశాలల్లో ఇది ఒకటి. కొబ్బరి కేంద్రమైన అంబాజీపేటలో ఉన్న ఈ పాఠశాలలో గతంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించేవారు. ఇక్కడ చదివిన ఎందరో విద్యార్థులు దేశ విదేశాలతో పాటు ఇస్రో వంటి సంస్థలలో శాస్త్రవేత్తలుగా పనిచేశారు. దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఈ పాఠశాలలోనే చదివారు.

ఇంతటి అరుదైన ఘనత సాధించిన ఈ పాఠశాల గత ప్రభుత్వకాలంలో గణనీయంగా అభివృద్ధి చెందింది. పేరు ప్రఖ్యాతలు ఉన్న ఈ పాఠశాలకు బ్రాండ్ ఇమేజ్ కల్పించాలనే లక్ష్యంతో సొంతంగా వెబ్‌సైట్ ఏర్పాటు చేయాలని పాఠశాల పూర్వ విద్యార్థులు నిర్ణయించుకున్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి, స్థానికుడైన కొర్లపాటి దొరబాబు ఈ వెబ్‌సైట్ రూపొందించారు. జెడ్పీహెచ్‌స్కూల్‌అంబాజీపేట.కామ్ పేరున దీనిని ఏర్పాటు చేశారు.

మూడు లక్ష్యాలతో ప్రారంభం..

పాఠశాల చరిత్ర, పాఠశాల ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ఆయా విద్యా సంవత్సరాల వారీగా విద్యార్థుల జాబితాను అందుబాటులో ఉంచడం, పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులు సాధిస్తున్న విజయాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలు, వాటికి సంబంధించిన ఫొటోలు దీనిలో పొందుపరచనున్నారు. పాఠశాల పాత ఫొటోలతో పాటు కొత్త ఫొటోలను కూడా ఉంచుతారు. పాఠశాల వేదికగా పూర్వ విద్యార్థుల కలయికలు, ఉన్నత స్థాయిలో ఉన్నవారి చరిత్రను కూడా దీనిలో నిక్షిప్తం చేయనున్నారు. అలాగే బ్యాచ్‌ల వారీగా వివరాలతో పాటు వైద్యులు, ఇంజినీర్లు, వ్యాపారులు, ఉన్నత విద్యావంతులు, శాస్త్రవేత్తలు, ఎన్‌ఆర్‌ఐలు, జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను, ఫొటోలను ఆయా విభాగాలుగా అందుబాటులో ఉంచనున్నారు. వీటితోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల నోటిఫికేషన్‌లు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగాల నోటిఫికేషన్‌లను సైతం వీటిలో ఉంచాలని దీనిని తయారు చేశారు. తద్వారా జిల్లాలో ఉన్నవారితో పాటు ఉపాధి కోసం దేశ విదేశాల్లో ఉన్నవారికి ఎప్పటికప్పుడు పాఠశాల కార్యక్రమాలు తెలియడంతో పాటు అభివృద్ధిలో వారిని భాగస్వాములగా చేయాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు.

జిల్లాలో పలు ఉన్నత పాఠశాలలు సైతం సొంతంగా వెబ్‌సైట్‌లు రూపొందించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల సైతం ఇదే కార్యచరణకు సిద్ధమవుతోంది.



అంబాజీపేట ఉన్నత పాఠశాల వెబ్‌సైట్

అందరినీ భాగస్వాములను చేయాలనే



పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో పూర్వ విద్యార్థులందరినీ భాగస్వాములను చేయాలనే లక్ష్యంతోనే ఈ వెబ్‌సైట్ రూపొందించాం. ఇటీవల చదువులు పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు చూపించడం, పాఠశాల విశేషాలు దేశ, విదేశాల్లోని పూర్వ విద్యార్థులకు తెలియాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారు. విద్యార్థుల పూర్తి డేటాను సేకరిస్తున్నాం.

– కొర్లపాటి వేణుగోపాలరావు (దొరబాబు), పూర్వ విద్యార్థి, అంబాజీపేట

ఇప్పటికే ఈ పాఠశాల తరఫున వందలాది మంది పూర్వపు విద్యార్థులతో నిర్వహిస్తున్న జెడ్పీహెచ్ స్కూల్ అంబాజీపేట వాట్సప్ గ్రూపు ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల పాఠశాలలో నిర్మిస్తున్న భోజనశాల, ఆడిటోరియం నిర్మాణం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న పోటీలకు పలువురు పూర్వ విద్యార్థులు వేలాది రూపాయిలను ఆర్థిక సాయంగా అందిస్తుండడం విశేషం.

క్లుప్తంగా

గీత కార్మికులకు 20 శాతం మద్యం దుకాణాలు

మంత్రి సుభాష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

మలికిపురం: ప్రభుత్వం **ప్రకటించనున్న** నూతన మద్యం విధానంలో **గీత కార్మికులకు** 20 శాతం షాపులను కేటాయిం**చనున్నట్లు రాష్ట్ర** కార్మిక శాఖా మంత్రి వాసంశె**ట్టి సుభాష్ పేర్కొ**న్నారు. ఆదివారం మండల**ంలోని గుడిమెళ్లం**కలో గల్ఫ్ శెట్టిబలిజ యువ**శక్తి సేవా సంస్థ** సభ్యులను మంత్రి సుభాష్ సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన సంఘం సేవలను కొనియాడారు. సంఘ అధ్యక్షుడు కట్టా భాస్కర్, అకౌంటెంట్ గుబ్బల శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి పెయింటర్ మృతి



పల్లపు గంగరాజు మృతదేహం

కొత్తపేట: సిద్ధి వినాయక ఆలయానికి రంగులు వేస్తున్న పల్లపు గంగరాజు (34) విద్యుత్ వైర్లు తగిలి ఆదివారం మృతి చెందాడు. కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వినాయక చవితిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రంగులు వేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ముమ్మిడివరం మండలం తానేల్లంకకు చెందిన గంగరాజుకు రంగులు వేసే పనిని అప్పగించారు. రంగులు వేసే క్రమంలో ఆలయం పక్క నుంచి వెళ్లిన 11 కేవీ విద్యుత్ తీగలను అతడు గమనించక తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పీఎం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. గంగరాజు భార్య లక్ష్మి, కుమారుడు వీరనాగకార్తికేయ, కుమార్తె ధరణి మహిత అనే పిల్లలు ఉన్నారు.

పశుసంవర్ధకశాఖ సహాయకుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న డాక్టర్ శ్రీనివాసచౌదరి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పశుసంవర్ధకశాఖ సహాయకుల(ఏహెచ్ఏ) సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక దేవీచౌక్‌లోని వెటర్నరీ హాస్పిటల్ ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ చైర్మన్ డా.శ్రీనివాస్‌చౌదరి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని నియమించారు. సంఘ అధ్యక్షుడిగా జి.అర్జున్, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా ఎం. సత్తిరాజు, జనరల్ సెక్రటరీగా కె.రాకేష్ కుమార్, ట్రెజరర్‌గా బి.అనంత లక్ష్మి, వైస్ ప్రెసిడెంట్స్‌గా జి.అంబేద్కర్, పి.చిన్న వెంకటేష్, కె.సత్యనారాయణ రాజు, జాయింట్ సెక్రటరీలుగా ఎన్.విజయ దుర్గారావు, పి.మధుబాబు యాదవ్, ఈసీ సభ్యులుగా ఆర్.గౌతమ్ కుమార్, పి.దేవి ప్రసాద్, బి.ఆనంద్ బాబు, ఏ.శ్రీనివాస్, కె.యశ్వంత్‌లను ఎన్నుకున్నారు.



రాత్రివేళ పోలీస్ సెక్యూరిటీ అవసరం

ఆసుపత్రుల్లో రాత్రి వేళల్లో పోలీస్ సెక్యూరిటీ ఎంతో అవసరం. నైట్ డ్యూటీ ఉన్న వైద్యులకు సెక్యూరిటీగా పోలీసులను కేటాయించాలి. ప్రధానంగా మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకు రావాలి.

– డాక్టర్ కె.యుక్తిక, రాజమహేంద్రవరం



వైద్యులకు భద్రత కల్పించాలి

జూనియర్ మహిళా వైద్యురాలిపై జరిగిన పాశవిక సంఘటన దుర్మార్గం. ప్రాణాలు పోసే వైద్యుల ప్రాణాలకే రక్షణ లేకపోవడం దారుణం. సమాజంలోనూ మార్పు రావాలి. ప్రభుత్వాలు కూడా ఆస్పత్రుల వద్ద మహిళా వైద్యులు, సిబ్బందికి భద్రత కల్పించాలి.

– డాక్టర్ చంద్రలేఖ, ఎండీ జనరల్, రాజమహేంద్రవరం



అంతకందకూ లాభాలు

- అంతర సాగుతో బహుళ ప్రయోజనాలు
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు
- దేశీయ మార్కెట్‌లో పెరుగుతున్న డిమాండ్



కొబ్బరి తోటలో కందను అంతర పంటగా సాగు చేస్తున్న రైతుకు సూచనలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

అలమూరు: కందసాగు రైతులకు లాభాలను తెచ్చి పెడుతోంది. దీనిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించే వీలుంటుంది. దీంతో చాలామంది ఈసాగుపై ఆసక్తి చూపుతున్నారు. కొందరు పూర్తిస్థాయిలోనూ, మరికొందరు అంతరపంటగానూ కందను సాగు చేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో కూరగాయల సాగు తర్వాత కందనే అత్యధికంగా పండిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,102 ఎకరాల్లో సాగవుతోంది. కందతో అనేక పోషకాలు ఉంటాయి. కార్పొరేట్ కంపెనీలు కూడా ఈ పంటను కొనుగోలు చేస్తుండడంతో డిమాండ్ పెరుగుతోంది.

అనేక రకాల విత్తనాలు

కేంద్ర దుంప పంటల పరిశోధన కేంద్రం అంచనాల ప్రకారం కందలో అనేక రకాలు విత్తనాలు ఉన్నాయి. వాటిలో అధిక దిగుబడిని ఇచ్చే గజేంద్ర, శ్రీపద్మ, శ్రీఅతిర, కుసుమ్ వంటి రకాలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అంతర పంటగా సాగుచేసే కంద తగినంత ఆదాయాన్ని ఇస్తుంది. అలాగే కందను ప్రధాన పంటగా సాగు చేస్తే చక్కని ఫలితాలు సాధించవచ్చు. ప్రధాన పంటగా సాగు చేస్తే హెక్టారుకు 60 టన్నులు, అంతర పంటగా సాగు చేసినప్పుడు హెక్టారుకు 20 నుంచి 25 టన్నుల మధ్య దిగుబడి వస్తుంది.

పోషకాలు, ప్రయోజనాలు

కంద దుంపలో కార్బోహైడ్రేట్లు, కాల్షియం, పాస్పరస్, పొటాషియం, విటమిన్ సీ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. గుండె సంబంధిత వ్యాధులు, చెడు కొలెస్ట్రాల్ సమస్యలను అధిగమించవచ్చు. కంద దుంపను తరచూ కూరల ద్వారా ఆహారంగా తీసుకోవడం ద్వారా క్యాన్సర్ సోకే అవకాశం ఉండదు. ఊబకాయం, మధుమేహం, కీళ్ల నొప్పులు, ఎముకల సమస్యల నుంచి రక్షిస్తుంది. మహిళల్లో ఈస్ట్రోజన్ ఉత్పత్తిని పెంచడానికి దోహదపడుతుంది.

సాగు విధానం

కంద పూర్తిగా మొలకెత్తడానికి నెల రోజులు పడుతుంది. మురుగునీటి వసతి కలిగిన తేలికపాటి



కంద దుంపలు

నేలలు దీనికి అనుకూలం. ఉదజని సూచిక 6-7 ఉన్న నేలలు అయితే బాగుంటాయి. నీటి వసతి అందుబాటులో ఉంటే ఏడాది పొడవునా సాగు చేసుకోవచ్చు. నేల స్వభావాన్ని బట్టి ఎరువులు, పురుగు మందులు వినియోగించాలి. కందను ప్రధాన పంటగా వేసినప్పుడు ఎకరానికి 1,400 కిలోల మేర విత్తనం అవసరమవుతుంది. అంతర పంటగా వేసినప్పుడు, ప్రధాన పంట మొక్కల సాంద్రతకు అనుగుణంగా 500 - 900 కిలోల మధ్య విత్తనం అవసరం ఉంటుంది. విత్తన సమయంలో 500-700 గ్రాముల బరువుగల దుంపలను విత్తుకోవాలి. దుక్కులు చేసుకున్న తర్వాత వరసల మధ్య 60 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 60 సెంటీమీటర్ల దూరం పాటించాలి. 60 - 80 సెంటీమీటర్ల లోతులో గుంతలు తవ్వుకుని విత్తన దుంపలను నాటుకుంటే చక్కని ఫలితం ఉంటుంది.

విత్తన దుంపల నిల్వ

విత్తన దుంపలను తవ్విన తర్వాత అవి కనీసం రెండు నెలల నిద్రావస్థలో ఉంటాయి. ఆ సమయంలో అవి కుళ్లిపోకుండా ఉండడానికి తవ్విన నాలుగు లేక ఐదు రోజుల తర్వాత దుంపలపై శిలీంధ్ర నాశక మందులు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ ఒక గ్రాము మందును 10 లీటర్ల నీటిలో కలిపి ఆ దావణాన్ని దుంపలపై పూర్తిగా తడిసేలా పిచికారి చేసి నీడన ఆరబెట్టాలి. అలా ఆరబెట్టిన దుంపలను గాలి వెలుతురు ఉండే పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి. ఒక ఎకరాకు కావాల్సిన విత్తన దుంపలను కేవలం 25 సెంట్లు విస్తీర్ణంలో సాగు చేసుకుని ఉత్పత్తి చేసుకోవచ్చు.

సాగు విధానాలు

కందను సాగుచేసే నేలను రెండు, మూడు పర్యాయాలు లోతుగా మెత్తగా దుక్కిచేయాలి. కంద సాగు నేలలో చివికిన పశువుల ఎరువుతో పాటు 200 కిలోల వేపపిండి వేయాలి. జీవన ఎరువులు వంటి ట్రైకోడర్మా రెండు కిలోలు, సూడోమోనాస్ రెండు కిలోలు, 24 కిలోల భాస్వరం,150 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను పొలంలో వేసి కలియదున్నాలి. ఎకరాకు 100 కిలోల నత్రజని, 225 కేజీల యూరియా, 100 కిలోల పొటాష్, 180 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను మిశ్రమం చేసి నిల్వ చేయాలి. ఆ మిశ్రమాన్ని మూడు సమభాగాలుగా చేసి మొక్కను నాటిన 40, 80, 120 రోజుల తర్వాత ఎరువుగా అందించాలి. విత్తనం పాతిన ప్రదేశంలో ఎరువులు వేసి మట్టితో కప్పి తేలికపాటి తడి ఇవ్వాలి. ఇలా మట్టితో కప్పటం వలన రసాయనిక ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి తద్వారా అధిక దిగుబడులు సాధించే వీలు కలుగుతుంది. విత్తిన దుంపలు నాటిన తరువాత వాతావరణ పరిస్థితులను బట్టి 6 నుంచి 10 రోజుల వ్యవధిలో నీటితడులు పెట్టుకోవాలి. కంద తోటలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి. పంట కోత దశకు వచ్చినప్పుడు నీరు పెట్టకూడదు.

కలుపు యాజమాన్యం

కందను బలమైన నేలలో వేయటం, అధిక తడులు అవసరమైనందున కలుపు ఎక్కువగా పెరగడానికి అవకాశం ఉంది. కలుపు తక్కువగా ఉన్నప్పుడు కూలీలతో తీయించాలి. కలుపు ఎక్కువగా వచ్చే భూముల్లో మొదటి దఫా తడి ఇచ్చిన తర్వాత, నేల తడిగా ఉన్నప్పుడే ఎకరాకు రెండు లీటర్లు బ్యూటాక్లోర్ లేదా, ఒక లీటర్ పెండిమిథాలి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పాలిథిన్ షీట్లతో మల్చింగ్ చేస్తే కలుపు పెరుగుదలను తగ్గించడంతో పాటు నేల తేమను సంరక్షించుకోవచ్చు. దుంపలు నాటిన 30 రోజులు, 60 రోజుల తర్వాత కలుపును తీసి మన్నును ఎగదోయడం వంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

దుంప తవ్వకాల్లో జాగ్రత్తలు

కంద దుంప 8 నుంచి 10 నెలల తర్వాత తవ్వకానికి తయారవుతుంది. ఆ సమయంలో ఆకులు పసుపు రంగుకి మారి, నేలపై వాలిపోతాయి. గడ్డపారతో దుంపలకి తగలకుండా జాగ్రత్తగా తవ్వి, వేర్లను, మట్టిని తీసివేసి శుభ్రం చేయాలి. తవ్వి తీసిన గడ్డలను నీడలో ఆరబెట్టినయితే 30 నుంచి 60 రోజుల వరకు నిల్వ ఉంటాయి. కందను అంతర పంటగా సాగు చేసినప్పుడు ఒక్కో పంటకూ ఒక్కోవిధంగా దిగుబడి వస్తుంది.

కందసాగు ఆశాజనకం



వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో కంద సాగు ఆశాజనకంగా ఉంది. కంద వినియోగం బాగా పెరగడంతో డిమాండ్ ఏర్పడింది. దీంతో ఎగుమతులు పెరిగి సరైన గిట్టుబాటు ధర లభిస్తోంది.

– యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, ఉద్యాన రైతు, బడుగువానిలంక

రైతుల ఆసక్తి



ఇటీవల కందకు డిమాండ్ పెరగడంతో గిట్టుబాటు ధర లభిస్తోంది. దీంతో రైతులు ఈ సాగుపై ఆసక్తిని చూపుతున్నారు. ప్రధాన పంటల మధ్య కందను అంతర పంటగా కూడా సాగు చేస్తున్నారు.

– జి.కోటేశ్వరరావు, ఉద్యానశాఖాధికారి, కొత్తపేట డివిజన్

బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఏఎన్ఎం, వార్డు హెల్త్ సెక్రటరీలు తమ బదిలీ దరఖాస్తులను మంగళవారం లోపు సమర్పించాలని కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను http://gramawardsachivalayam.ap.gov.in/gswslms/login వెబ్‌సైట్లో ఆన్‌లైన్‌లో సమర్పించాలని తెలిపారు. అలాగే హార్డ్ కాపీలు కాకినాడలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఖాళీల వివరాలు ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులకు స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో తెలియజేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు.

డెంగీతో మహిళ మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలేనికి చెందిన అడపా పావని (25) ఆదివారం ఉదయం కాకినాడ జీజీహెచ్‌లో డెంగీతో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వారం రోజుల క్రితం తన సోదరునికి రాఖీ కట్టేందుకు ఆమె తన పుట్టిల్లు ఉన్న సంపర వెళ్లారు. అక్కడ ఆమెకు జ్వరం రావడంతో కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించారు. చికిత్స తరువాత మళ్లీ సంపరకు వచ్చిన ఆమెకు ఫిట్స్ రావడంతో మళ్లీ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ఆరోగ్య పరిస్థితి శృతి మించడంతో వెంటిలేటర్‌పై 24 సాయంత్రం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం ఆమె మృతి చెందారు. ఆమె భర్త అడపా గోపాలకృష్ణ ద్రాక్షారామలో మెడికల్ షాపు నిర్వహిస్తుంటారు. వారికి 4 ఏళ్ల బాబు, 3 ఏళ్ల పాప ఉన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలం లీజుకు టెండర్లు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం డిపో పరిధిలోని రంగంపేట, అనపర్తి బస్‌స్టేషన్లలో ఖాళీ స్థలాలను 15 ఏళ్ల కాలానికి అద్దె ప్రాతిపదికన లీజుకు ఇవ్వటానికి టెండర్లు పిలుస్తున్నట్లు డిపో మేనేజర్ షేక్ షబ్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగంపేట బస్‌స్టేషన్ వెనుక ఉన్న 900 చదరపు గజాలు, అనపర్తి బస్‌స్టేషన్‌లోని 1,111 చదరపు గజాల ఖాళీ స్థలాలను లీజుకు ఇస్తామన్నారు. సెప్టెంబర్ 9వ తేదీ వరకూ టెండర్ దరఖాస్తు చేసేందుకు అవకాశముందన్నారు. ఔత్సాహికులు మరిన్ని వివరాలకు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా రాణించాలి

- డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్
- ఉత్సాహంగా హాకీ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీనివాస్ కుమార్, రంగారావు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జాతీయ క్రీడా దినోత్సవం ఆగస్టు 29ని పురస్కరించుకుని కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డీఎస్ఏలో అంతర్ పాఠశాలల హాకీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా క్రీడామైదానంలో డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. గౌరవ అతిథిగా ధ్యాన్‌చంద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు, పీడీ టీవీఎస్ రంగారావు హాజరయ్యారు. డీఎస్‌డీఓ కుమార్ మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని హాకీలో రాణించాలన్నారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా డీఎస్ఏ ఆధ్వర్యంలోను వివిధ రకాల క్రీడలు సోమవారం నుంచి ఇక్కడ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో హాకీ అభివృద్ధికి కృషి చేస్తున్న పీఈ రవిరాజును ఆయన అభినందించారు. హాకీ కోర్టుకు కావల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటానన్నారు. గౌరవ అతిథి రంగారావు మాట్లాడుతూ ఆటపై అంకితభావం, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏ క్రీడలోనేనా రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షుడు, హాకీ కోచ్, పీడీ రవిరాజు మాట్లాడుతూ అంతర్ పాఠశాల స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో 8 మంది బాలురు, ఆరుగురు బాలికల జట్లలో వివిధ పాఠశాలల నుంచి పాల్గొంటున్నాయన్నారు. అనతరం డీఎస్‌డీ శ్రీనివాస్ కుమార్, రంగారావు ఉప్పాడ కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాల, కాకినాడ బుడంపేట మున్సిపల్ స్కూల్ జట్లను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. డీఎస్ఏ హాకీ కోచ్ నాగేంద్ర, పీడీలు సూరిబాబు, పరశురాం, కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు బాబ్జీ, కార్యదర్శి గంగాధర్, ట్రెజరర్ వినయ్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో పీఆర్‌జీసీపై ఎస్ఎస్ఆర్‌కే 4-0 స్కోర్‌తోను, ఉప్పాడ జట్టు సాలిపేట జట్టుపై 2-0 స్కోర్‌తోను, సాలిపేట జట్టు ఎస్ఎస్ఆర్‌కేపై 4-0 స్కోర్‌తోను, గైగోపాడు జట్టు ఉప్పాడపై 2-0 స్కోర్‌తోను విజయం సాధించాయి. బాలుర విభాగంలో గైలోలుపాడు జట్టుపై కేంద్రీయ విద్యాలయం జట్టు 2-1 స్కోర్‌తోను, తిలక్‌స్ట్రీట్ జట్టుపై ఉప్పాడ జట్టు 5-1 స్కోర్‌తోను, అక్షర స్కూల్ జట్టుపై ఆనంద భారతి జట్టు 0-2 స్కోర్‌తోను విజయం సాదించాయని రవిరాజు తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి



గంగాధర వర్మ (ఫైల్)

తాళ్లరేవు: జాతీయరహదారి 216లో సుంకటరేవు రామాలయం వద్ద ఆదివారం ఉదయం ఆర్టీసీ బస్సు ఢీకొని మల్లాడి గంగాధర్ వర్మ (25) దుర్మరణం పాలయ్యాడు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు గాడిమొగ గ్రామానికి చెందిన గంగాధర్ వర్మ ఏటీఎంలో డబ్బులు తీసుకునేందుకు బైక్‌పై యానాం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగాధర్ వర్మ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి వీర్రాఘవులు గాడిమొగలో పాన్‌షాప్ నిర్వహిస్తున్నారు. అతనికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మూడవ కుమారుడైన వర్మ గాడిమొగ సచివాలయంలో వలంటీర్‌గా పనిచేసేవాడు. ప్రస్తుతం తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. వలంటీర్ మృతితో గాడిమొగలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనాస్థలిలో గంగాధర్ వర్మ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

బాక్స్ బద్ధలైపోవాల్సిందే!

- బాక్స్ క్రికెట్‌కు పెరుగుతున్న క్రేజ్
- పట్టణాలకు, పల్లెలకు వేగంగా విస్తరణ
- అనుబంధంగా ఫుడ్ కోర్టుల ఏర్పాటు
- సాయంత్రం సమయాల్లో టెర్రస్‌లపై ఫోర్లు, సిక్సుల మోత

క్రికెట్ పుట్టింది ఇంగ్లండ్‌లోనే అయినా ఆ క్రీడని పిచ్చిగా ఆరాధించేవారు మాత్రం భారత దేశంలోనే ఎక్కువ. అందరూ భారత జట్టుకో.. రాష్ట్ర జట్టుకో ఆడాలనుకున్నా కుదిరే పనికాదు. మరి ఆ సరదా తీరాలంటే.. అటువంటి వారికోసమే గల్లీ క్రికెట్ ఉన్నది. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో దానికీ సమయం చిక్కడం లేదు. ఎక్కడి మైదానానికో వెళ్లాలి. అక్కడ అప్పటికే ఎవరూ వికెట్లు పాతెయ్యకుండా ఉండాలి. 11 మందీ ఉండాలి.. ఇలా ఎన్నో నిబంధనలు.. అవరోధాలు. ఆ ఇబ్బందులను తోసిరాజని నేనున్నానంటూ ఇళ్లపైకే వచ్చేసింది బాక్స్ క్రికెట్. తక్కువ స్థలం.. తక్కువ ఓవర్లు.. తక్కువ క్రీడాకారులు.. ఎంత గట్టిగా బాదినా అందుబాటు దూరంలో పడే బంతి.. ఇంకేం కావాలి.. క్రికెట్ ప్రేమికులు కోరుకునేదీ అదే కదా.. ఆడేద్దామా మనమూ మన మేడపై.. ఇంకెందుకు ఆలస్యం పదండి క్రికెట్ కిట్ పట్టుకుని..

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): గల్లీ క్రికెట్ ఇప్పుడు బాక్స్ క్రికెట్‌గా మారుతోంది. నిన్న మొన్నటి వరకు నగరాల్లో కనిపించిన ఇండోర్ టర్ఫ్‌లు పట్టణాలకు వచ్చేశాయి. ఫ్లడ్‌లైట్లు, ఫుడ్‌కోర్టు సదుపాయాలతో అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఔత్సాహికులు ఇంటి టెర్రస్‌ల పైనా మినీ టర్ఫ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. విదేశాల్లో ఎప్పుడో మొదలైన ఈ బాక్స్ క్రికెట్ పదేళ్ల క్రితం భారత్‌లోకి వచ్చింది. మొదట ముంబైలో ఎక్కువగా దీన్ని ఆడేవారు. ఆ తర్వాత హైదరాబాద్, తిరుపతి, విశాఖ తదితర నగరాలకు ఇది వేగంగా విస్తరిస్తోంది.

పకడ్బందీ ఏర్పాట్లు...

బాక్స్ క్రికెట్‌కు ఆదరణ బాగుండడంతో ఔత్సాహికులు వీటి ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఖాళీ స్థలాన్ని బట్టి 30-40 మీటర్ల వరకు పొడవు, 25-30 మీటర్ల వరకు వెడల్పు విస్తీర్ణం, 15 మీటర్ల వరకు ఎత్తులో చుట్టూ పకడ్బందీగా పోల్స్ ఏర్పాటు చేసి వాటి చుట్టూ, పైన నెట్ అమరుస్తున్నారు. రాత్రి వేళల్లో ఆడేందుకు వీలుగా ఎత్తులో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో బాక్స్ క్రికెట్ కోర్టు నిర్మాణానికి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలు ఖర్చు అవుతుంది. వర్షం వచ్చిన వెంటనే నీరు లాగే విధంగా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఇండోర్ టర్ఫ్‌లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, కాకినాడ, అన్నవరం, తుని, అమలాపురం, చిత్రాడ తదితర ప్రాంతాల్లో 12 వరకు ఉన్నాయి. కాకినాడ నగరంలో శ్రీనగర్, గుడారిగుంట, లక్ష్మీనగర్, సురేష్‌నగర్, గైగోలుపాడు, సర్పవరం, జగన్నాథపురం, కొవ్వాడ, చీడిగ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. కళాశాలల్లో విద్యార్థుల కోసం వీటిని ఏర్పాటు చేస్తుండగా కుటుంబ సభ్యులు కలిసి ఆడుకునేందుకు వీలుగా కొందరు ఔత్సాహికులు తమ ఇంటి టెర్రస్‌ల పైనా ఏర్పాటు చేసుకుంటున్నారు.



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో బాక్స్ క్రికెట్ నెట్స్‌లో రాత్రి పూట సాధన చేస్తున్న క్రీడాకారులు

వసతులను బట్టి వసూళ్లు..

బాక్స్ క్రికెట్ కోర్టులోని వసతులను బట్టి గంటకు రూ.700 నుంచి రూ.వెయ్యి వసూలు చేస్తున్నారు. వీకెండ్స్, సెలవు రోజుల్లో డిమాండ్‌ను భట్టి ధర మరింత పెరుగుతుంది. ఆన్‌లైన్ ద్వారా ముందుగానే ఆడే సమయాన్ని బుక్ చేసుకోవచ్చు. కొన్ని చోట్ల యాప్‌ల ద్వారా కూడా స్లాట్ బుక్ చేసుకునే సదుపాయం కల్పిస్తున్నారు. క్రికెట్ కిట్‌ను నిర్వాహకులే అందజేస్తున్నారు. ఎక్కువ మంది కలిసి ఆడడం వల్ల అందరూ తలాకొంత వేసుకుని చెల్లించడంతో ఆడేవారికి పెద్దగా భారం అనిపించదు.

పెరుగుతున్న ఆదరణ..

ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రిళ్లు ఆడే సౌలభ్యంతో పాటు శారీరకంగా పెద్దగా శ్రమించాల్సిన అవసరం లేని రీతిలోనే నిబంధనలు ఉన్నాయి. చిన్న గ్రౌండ్ కావడంతో బంతి కోసం ఎక్కువ దూరం పరిగెత్తాల్సిన అవసరం ఉండదు. టీములోను ఆరుగురు ఆటగాళ్లే ఉంటారు. గరిష్టంగా 10 ఓవర్లే ఉండడంతో గంట లోపే మ్యాచ్ అయిపోతుంది. పరుగెత్తి బౌలింగ్ చేయాల్సిన పని లేదు. నిలబడి అలా విసిరినా చాలు. టెన్నిస్ బంతినే వాడతారు కాబట్టి గాయాల సమస్యా ఉండదు. నెట్ లోపల పూర్తిగా కృత్రిమ గడ్డి మ్యాట్‌లను ఉపయోగిస్తుండడంతో దుమ్ము కూడా రాదు. పరిగెడుతూ కింద పడినా దెబ్బలు తగిలే అవకాశం తక్కువ. వాష్ రూమ్స్, దుస్తులు మార్చుకోవడానికి గదులు కూడా ఇందులోనే ఉన్నాయి. కొన్ని చోట్ల ఫుడ్ కోర్టులు, డ్రింక్స్, స్నాక్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇన్ని సౌలభ్యాలు ఉండడంతో బాక్స్ క్రికెట్‌కు ఆదరణ పెరుగుతోంది. పిల్లలు మాత్రమే కాకుండా పెద్దలు బాక్స్ క్రికెట్‌కు ఆకర్షితులవుతున్నారు. బాక్స్ క్రికెట్‌లో ఫోర్లు, సిక్సర్లు మోత మోగిస్తున్నారు.



కాకినాడలో ఏర్పాటు చేసిన నెట్స్‌లో ఆడుతున్న క్రీడాకారులు

బాక్స్ క్రికెట్ ఆడడం ఇష్టం



నాపేరు మణిరత్నం. నేను చిన్నతనం నుంచి గల్లీ క్రికెట్ ఆడేవాడిని. ఇప్పుడు కొవ్వాడలోని బాక్స్ క్రికెట్‌లో ప్రతి శని, ఆది వారాల్లో స్నేహితులతో కలసి క్రికెట్ ఆడతాను. ఒత్తిడిని అధిగమించడానికి బాక్స్ క్రికెట్ నెట్స్‌లో సమారు రెండు గంటలు గడుపుతాను.

– మణిరత్నం, కాకినాడ

బాగా ఆస్వాదిస్తున్నా...



క్రికెట్ అంటే చాలా ఇష్టం. టెన్నిస్ బాల్‌తో సాయంత్రం పూట, సెలవు రోజుల్లో బాక్స్ క్రికెట్‌ను ఆస్వాదిస్తున్నా. ఆట స్థలాలు అంతగా లేక పోవడంతో స్నేహితులంతా కలిసి ఈ బాక్స్ క్రికెట్‌లోనే ఆడుకుంటున్నాం. అన్ని ఏర్పాట్లు ఉండడంతో పాటు రాత్రి వేళల్లో ఆడుకునే వీలుంది.

– చందు, క్రికెట్ క్రీడాకారుడు